క్లుప్తంగా

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇంటర్మీడియట్, జిల్లా విద్యాశాఖ అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. ఈ నెల 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం డీఐఈఓ శ్రీధర్ సుమన్ పరీక్షల వివరాలు తెలిపారు. జిల్లాలో 33 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం 10,976 మంది, రెండో సంవత్సరం 10,954 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పదో తరగతికి సంబంధించి జిల్లాలో 59 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 12,866 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని డీఈఓ వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. అందుకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఉదయం 7 నుంచి ప్రత్యేక బస్సులను నడపాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని, కేంద్రాల్లో ఫ్యాన్లు, లైటింగ్, మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు ఉమామహేశ్వర్, రవీందర్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి సహకారంతో మాడ్రన్ హైస్కూల్ ఎస్ఎస్‌సీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతోపాటు వివిధ సందర్భాల్లో ఇచ్చిన నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ పాల్గొన్నారు. అదే విధంగా సీపీఎస్ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

బాలిక అదృశ్యం

జడ్చర్ల: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి సమీపంలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బాలిక(14) కనిపించకుండా పోయింది. ఈమేరకు ఆమె తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఒడిషా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు తన కుమార్తెకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

కౌన్సిలర్‌పై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం: కాంగ్రెస్‌కి చెందిన 25మంది నేతలు, కార్యకర్తలు మోతీనగర్ కౌన్సిలర్ ఖాజాపాషాపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఐ డి.స్వామి కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని 36వార్డు కౌన్సిలర్ ఖాజా పాషా సీఎం రేవంత్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి సదరు వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో నాయకులు ఆయనపై ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

వేరుశనగ క్వింటాల్ రూ.5,619

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో వేరుశనగ క్వింటాల్‌కు రూ.5,619 ఒకే ధర నమోదైంది. సీజన్ లేకపోవడంతో మార్కెట్‌లో లావాదేవీలు తక్కువ మొత్తంలో సాగాయి.

■ మార్కెట్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ఉల్లిపాయల బహిరంగ వేలం జరుగుతుంది. ప్రస్తుతం ఉల్లి సీజన్ కావడంతో వేల బస్తాల్లో ఉల్లి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. ఉల్లి వేలంలో స్థానిక వ్యాపారులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పాల్గొనే అవకాశం ఉంది.

నారసింహా.. నమోస్తుతే



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న భక్తులు



అలంకరణలో స్వామివారు

● పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యెన్నం, ఎమ్మెల్సీ కూచుకుళ్ల

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలోని కొత్త గంజ్ సింహగిరిలో వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుప్రభాత నిత్యోత్సవాలు, బలిహరణం, శాత్తుమెుర, తీర్థప్రసాద గోష్టి, శ్రీవిష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దేవాలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఆలయ చైర్మన్ కొకుంట్ల చంద్రమౌళి గుప్తా, ఈఓ రంగాచార్యులు, ఓం ప్రకాశ్ బంగర్, రాము, పోల శ్రీనివాస్, రమేష్, బాలకిష్టయ్య, ఉమారాణి, శేఖర్‌నాయక్, సత్యం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యాబోధన కొనసాగుతోందని.. విద్యార్థులు చేరాలని ప్రిన్సిపాల్ వెంకటయ్య అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్, చంద్రధన, వెల్‌జాల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు చరణ్, కరన్‌జీ, అక్బర్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

గండీడ్: వెన్నాచేడ్‌లో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయంలో ఉదయం నుంచి హోమాలు నిర్వహించారు. ఉదయం గణపతి, నవగ్రహపూజ, వాస్తుహోమం, సహస్రయంత్ర పూజ, గాయత్రి, ప్రధానదేవతఅంకురార్పణ, యోగినిపూజ చేపట్టారు. అనంతరం భక్తిశ్రద్ధలతో విగ్రహాలను ఊరేగించారు. తదనంతరం మహాభిషేకం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతాచారి, ఆనందచారి, సత్యనారాయణచారి, అనంతం రమణాచారి, ఆలయ కమిటీ సభ్యులు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలేటి నర్సింలు, రామలింగం, శివమల్లప్ప, శరణప్ప, నందు, కమల, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

దేవరకద్ర: కౌకుంట్ల మండల యువజన కాంగ్రెస్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా నరేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రప్రతాప్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



విజయ సంకల్పయాత్రకు తరలిరండి



యాత్రకు బయలుదేరిన నాయకులు

పాలమూరు: నియోజకవర్గంలో బుధవారం నిర్వహించే విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కదలిరావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కృష్ణ నది వద్ద ప్రారంభమైన యాత్ర మంగళవారం జిల్లా కేంద్రంలోకి వస్తున్న నేపథ్యంలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బుధవారం సాయంత్రం 6.30గంటలకు క్లాక్‌టవర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, నారాయణ యాదవ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గంలో బుధవారం బీజేపీ విజయ సంకల్ప బస్ యాత్ర ఉంటుందని ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి, కన్వీనర్ కుర్వ రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ యాత్రలో పాల్గొంటున్నారని వివరించారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ నాయకులు మీసాల గణేష్ పేర్కొన్నారు. ఈమేరకు యాత్రకు మద్దతుగా పీయూ నుంచి బయలుదేరారు. శ్రీను మాదిగ, శివకుమార్, సుదాకర్, నాగేందర్ పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



నవాబుపేట: శివభక్తుల ఆధ్వర్యంలో మంగళవారం లోకిరేవులో నిర్వహించిన జ్యోతిర్లింగ మహాపడిపూజ వైభవంగా సాగింది. నందీశ్వరస్వామి ఆధ్వర్యంలో మాలాధారులు ప్రత్యేక పూజలు చేశారు. శివనామస్మరణతో గ్రామం మార్మోగింది. అనంతరం అన్నదానం చేశారు. నిర్వహించారు.

వార్డుల అభివృద్ధికి కృషి

పాలమూరు: మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్‌లను మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ సీఎంరేవంత్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో పట్టణంలో ఉన్న అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యాముల్, రమణయ్య, శ్రీహరి,బాబుల్‌రెడ్డి, అశ్విని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కాంగ్రెస్‌దే



మహమ్మదాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ఉమ్మడి మండల అధ్యక్షులు కేఎం నారాయణ, జితేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉమ్మడి మండలం నుంచి చేవెళ్ల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశానికి తరలి వెళ్లారు. పుల్లారెడ్డి, అనంతలక్ష్మారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, ఈసాబస్రవి, సుదర్శరావు, ఆశిరెడ్డి, పులీందర్‌రెడ్డి, చెంచు అంజిలయ్య పాల్గొన్నారు.

దేవదానంకు అభినందనలు



మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవలే పూణేలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 75 ఏళ్ల విభాగం షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం పొందిన దేవదానంను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అభినందించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, పరశురాం, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్, వేణుగోపాల్, విజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పర్యవేక్షణ ముఖ్యం

నవాబుపేట: నర్సరీల పర్యవేక్షణ చాలా ముఖ్యమని మండల స్థాయి అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని.. మొక్కలను సిద్ధం చేయించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గురుకుంట నర్సరీని పరిశీలించారు. ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అటవీశాఖ ద్వారా మండలంలో 7 నర్సరీలు కొనసాగుతున్నాయని.. వాటిలో ప్రధానంగా టేకుమొక్కలను పెంచుతున్నట్లు వివరించారు. ఇఓపీఆర్‌డీ బద్రునాయక్, శ్రీనివాస్, కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లు



మహమ్మదాబాద్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన గుడ్లు

మహమ్మదాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తుండడం మండల పరిధిలోని లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. గుడ్లు ఉడకబెట్టగా కుళ్లిన దుర్గంధం వాసనతో నీరులా మారిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా కేంద్రాల నుంచి కొంతమంది గుడ్లను తీసుకోకుండా వెళ్లిపోతున్నారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీలతో పాటు ఆయా గ్రామాల్లోనూ ఎనిమిది రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కుళ్లిన గుడ్ల విషయంపై అంగన్‌వాడీ టీచర్స్ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోతోంది. మంగంపేట్, మొకర్లాబాద్, షేక్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, ధర్మాపూర్ గ్రామాల్లో సైతం ఇలాంటి పరిస్థితే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. గుడ్లు కుళ్లిపోవడానికి కారణం అధికారుల నిర్లక్ష్యమా? పర్యవేక్షణ లోపమా? కాంట్రాక్టర్ల కక్కుర్తికోసమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయమై ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరిని వివరణ కోరగా కాంట్రాక్టర్ గుడ్లను నేరుగా సెంటర్లకు తరలిస్తున్నారని తెలిపారు. విషయంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. టీచర్లు గుడ్లను పరిశీలించి తీసుకోవాలని.. బాగాలేకపోతే తిప్పి పంపాలని అన్నారు.

21న మాదిగల జోడోయాత్ర



మహబూబ్‌నగర్ రూరల్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో ఈనెల 21న మాదిగల జోడో యాత్ర ప్రారంభం కానుందని మాదిగ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట యాదయ్య తెలిపారు. జోడో యాత్రకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డమీది గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ మాట్లాడుతూ యాత్ర ఈనెల 25న మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. నాయకులు వెంకటయ్య, రామస్వామి, గొరిట దినేష్, సుమన్ పాల్గొన్నారు.

కులవృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం 45 ఏళ్లు నిండిన కులవృత్తిదారులకు పింఛన్ సదుపాయంతో పాటు ఆరోగ్య బీమా కల్పించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అండ్ రజక యువజన క్రాంతి సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. రజకులకు జిల్లాలో గానీ, పట్టణ ప్రాంతాల్లో గానీ దుస్తులు ఉతకడానికి తగిన సదుపాయాలు లేక ఎనో ఇబ్బందుల పాలవుతున్నామన్నారు. పట్టణ అధ్యక్షుడు సీహెచ్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి మైబు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రజకుల ఇబ్బందులు తొలగించాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

కూలీల సంఖ్య పెంచాలి

నవాబుపేట: గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను ఇంకా పెంచాలని ఏపీఓ జ్యోతి సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో రైతులకు అవసరమైన పనులను మొదటి ప్రాధాన్యతగా చేపట్టాలని తెలిపారు. మంగళవారం సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. కూలీలకు అవగాహన కల్పించాలన్నారు.

గిరిజనులకు చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న లింగంనాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణం నడిబొడ్డున కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రూ.2కోట్లతో గిరిజన భవన్‌ను ఏర్పాటు చేసుకుంటామని జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు లింగంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవలే జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో గిరిజన భవన కోసం రూ.కోటి, సేవాలాల్ ఆలయానికి రూ.40లక్షలు ఇచ్చామని మాజీ మంత్రి చెప్పుకోవడం సరికాదన్నారు. రూ.15లక్షలు మాత్రమే కేటాయించారని, అక్కడ గిరిజన భవన్‌లా లేదని కేవలం షెడ్డూలా ఉందన్నారు. రెండుసార్లు గిరిజనులు ఓట్లు వేసి మాజీ మంత్రి చేసిందేమిలేదన్నారు. కిషన్‌నాయక్, తులసి రాంనాయక్, రవికుమార్, రాంచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందికి 12శాతం వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కాగా ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా గోపాల్

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ మాలల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కంచిమి గోపాల్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కర్ణం కిషన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు.

25న టాలెంట్ టెస్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు డ్రీం ఫోర్సు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు టీఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. ఈమేరకు కరపత్రాన్ని డీఈఓ రవీందర్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని బీఈడీ కళాశాలలో ఈనెల 25న టెస్టు ఉంటుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: కొత్తూర్ సమీపంలోని దుందుభీ వాగు నుంచి మంగళవారం తెల్లవారుజామున అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మిడ్జిల్‌కి చెందిన ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

హన్వాడ: చిన్నదర్పల్లి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను హన్వాడ బీట్ పోలీసులు పట్టుకున్నారు. కోయిల్‌కొండకు చెందిన రాజు జిల్లాకేంద్రానికి ఇసుకను తరలిస్తుండగా పట్టుబడినట్లు వివరించారు. టిప్పర్‌ను ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ వివరించారు.

నీరు వదలాలి

కష్టపడి పండించిన పంట ఎండిపోతుంటే తట్టుకోలేకపోతున్నాం. పశువులకు మేతగా వదిలేయాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఏమీ చేయాలో అర్థం కావడం లేదు. కనీసం చెరువు తూము తెరిచి నీటిని విడుదల చేస్తే కొంత మేర పంటను కాపాడుకునే అవకాశం ఉంది.

– రాంరెడ్డి, రైతు, కొత్లాబాద్

రెండు ఎకరాలు ఎండిపోయింది

గ్రామంలో రెండు ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. పొలం దున్నటానికి, వరినాట్లు వేయటానికి, ఎరువుల వాడకం, కలుపు మొక్కల తొలగింపునకు ఎకరాకు రూ.20వేలు మొత్తం రూ. 40వేలు అప్పుచేశాను. ఒక్కసారిగా బోరుబావులు నీరు అడుగంటింది. పంటమొత్తం ఎండిపోతోంది.

– రాజీరెడ్డి, రైతు, కోయిల్‌కొండ

నీటిని పొదుపు చేసుకోవాలి

ఈసారి వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో మండలంలో భూగర్భజలాలు పడిపోతున్నాయి. ప్రస్తుతం మండలంలో వరి సాగు చివరి దశకు చేరుకుంటోంది. ఈసమయంలో రైతులు నీటి పొదుపుగా వాడకుంటే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. నీటి జాగ్రత్తగా వాడుకోవాలి.

– రాంపాల్, వ్యవసాయాధికారి, కోయిల్‌కొండ

నీరులేక ఎండుతున్న పంటలు



కొత్లాబాద్‌లో నెర్రెలిచ్చిన వరిపొలం



కోయిల్‌కొండలో పరిస్థితి

● అడుగంటిన భూగర్భజలాలు
● ఎకరం పొలం కూడా తడపలేక అవస్థలు పడుతున్న రైతులు

కోయిల్‌కొండ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల వరిపొలాలు నీరులేక ఎండిపోతున్నాయి. దీంతో అందిన కాడల్లా రూ.లక్షలు అప్పులు తెచ్చి వ్యవసాయం చేసిన రైతులకు చివరకు రూపాయి లాభం కూడా రాని పరిస్థితి నెలకొంటోంది. బావుల్లో, బోర్లలో భూగర్భజలాలు అడుగంటుతుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎకరం పొలం తడవాలంటే మూడు రోజుల సమయం పడుతుండడంతో రైతులు రాత్రింబవళ్లు పోలాల వద్ద కాపలాఉండాల్సి వస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది బోరు బావుల్లో నీరు అడుగంటుతోంది. మండలం పరిధిలో ఈ సీజన్‌కు సంబంధించి దాదాపు 9వేల ఎకరాలకుపైగా వరిపంటను రైతులు సాగుచేశారు. కాగా చాలా ప్రాంతాల్లో వరి పొలాలు నీరులేక మొత్తం నెర్రలు వారాయి. కోయిల్‌కొండ మండలంలోని కోత్లాబాద్, సూరారం, కోయిల్‌కొండ, మల్కాపూర్, అభంగపట్నం, కనాయపల్లి, వింజామూర్, ఆచార్యపూర్, ఖాజీపూర్, చంద్రాస్‌పల్లి, శేరవెంకటాపూర్, మోదీపూర్, ఎల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది. ఈ ఏడాది సరైన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నీటి వనరులు త్వరగా ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం వంటి కారణాలు రైతులను కష్టాల పాలు చేస్తున్నాయి. ఇక బోరుబావులపై మాత్రమే ఆధార పడిన వారి పరిస్థితి మరీ తీసికట్టుగా మారింది. పరిస్థితి కొనసాగితే మరో పదిరోజుల్లో వరి పంటపై ఆశ వదులుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర పంటలు, కూరగాయాలు, ఆయిల్‌ఫామ్ పంటల పరిస్థితి ఇదే విధంగా ఉందని చెబుతున్నారు.

తూము తెరిచి నీళ్లు వదలాలి

ఇదిలా ఉండగా.. మండలంలోని కొత్లాబాద్‌లో చెరువు తూము తెరిచి పంటపొలాలకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు కురవలేదని దీంతో వరి పంటలు వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని.. తూము తెరిచి నీరు వదిలితే కొంతమేర మేలు జరుగుతుందని అంటున్నారు.